అక్కా తమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు ప్రతీక రక్షాబంధన్ : ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర - పాతపట్నం : మండలం కేంద్రంలో ప్రభుత్వం మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు నిర్వహించిన రాఖీ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆమె మాట్లాడుతూ అన్నా, చెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే పండుగనే రాఖీ పండుగ. ఒకప్పుడు ఉత్తర, పశ్చిమ భారత దేశాలకే పరిమితమైన ఈ పండుగను ఇప్పుడు దేశవ్యాప్తంగా అందరూ ఘనంగా జరుపు కుంటున్నారు. సోదరి తన సోదరుడు హిమాన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ రాఖీ కట్టి ఎల్లప్పుడూ అన్నకు అండగా ఉంటానని చెప్తుంది. సోదరి కట్టిన రక్షా బంధనాన్ని స్వీకరించిన అన్న తానెప్పుడూ చెల్లెలికి రక్షగా ఉంటానని ఈ పండుగ ద్వారా తెలియజేస్తారు మహా భారతంలో ద్రౌపది,శ్రీకృష్ణుల అన్నాచెల్లెళ్ల అనుబంధం గొప్పది. శిశుపాలుడిని శిక్షించే క్రమంలో తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణుని చూపుడు వేలికి గాయమై రక్తం ధారగా కారుతుంది. అక్కడే ఉన్న సత్యభామ, రుక్మిణి మొదలైనవారు కంగారుపడి గాయానికి మందుపూయడానికి తలో దిక్కున వెళ్లి వెదుకుతుంటే ద్రౌపది తన చీర కొంగు చింపి వేలికి కట్టు కట్టిందట. దీనికి కృతజ్ఞతగా భగవానుడు ఆమెకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇస్తాడు. అందుకే కురు సభలో ద్రౌపది వస్త్రాపహరణానికి దుశ్శాసనుడు ప్రయత్నిస్తే ఆమెను పరంధాముడు ఆదుకున్నాడని అన్నారు. అలాగే ఈ రాష్ట్రంలో జగనన్న ఒక సోదరుడిగా రాష్ట్రంలోని ప్రతి అక్కచెల్లమ్మకు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉద్యోగపరంగా, రాజకీయంగా సాధికారత కల్పిస్తా ఈ నాలుగేళ్ల పాలనలో దేశచరిత్రలోనే ఎవరూ చేయని విధంగా అన్ని అంశాల్లో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు సీఎం వైయస్ జగన్. అక్కచెల్లెమ్మలు అన్ని రంగాల్లో ముందుండాలని కోరుకుంటూ, ప్రతి సోదర సోదరికి రాఖీ పండుగ సందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఎరుకొల వెంకటరమణ, శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి దేవాలయం పాలక మండలి చైర్మన్ నూలు ఈశ్వరరావు, వైఎస్సార్ సిపి మండల కార్యదర్శి గొకవలస రాము, సర్పంచ్ ప్రతినిధి లు పనుకు మోహన్, తూలుగు ప్రవీణ్ కుమార్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు గురాడి అప్పన్న ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ చక్రపతి, కమర్స్ అధ్యాపకులు నాయక్, కంప్యూటర్ అధ్యాపకులు నందగిరి తిరుమలరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీ, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఈఆర్ ఆధ్వర్యంలో 'మన దేవాలయం - మన హక్కు' సంతకాల సేకరణ

విశాలాంధ్ర - రణస్థలం : భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి లో అన్యమతస్థులకు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు చోటు కల్పించడం పై నిరసన తెలియజేస్తూ, హిందూ ధర్మ పవిత్రతను కాపాడాలని కోరుతూ బుధవారం ఎచ్చెర్ల నియోజకవర్గం, రణస్థలం మండల కేంద్రం, రామతీర్థం జంక్షన్ వద్ద గల శ్రీ ఆంజనేయస్వామి గుడి వద్ద ఎచ్చెర్ల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున హిందూ బంధువులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ వైఖరి పట్ల తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ సంతకాలు చేయడం జరిగింది. అలాగే ఎన్‌హెచ్16 జాతీయ రహదారి పై మన దేవాలయం మన హక్కు, ధర్మో రక్షితి రక్షితః, జై శ్రీరామ్ నినాదాలతో హిందూ బంధువులు నినదించారు. ఈ సందర్భంగా ఎన్ఈఆర్ మాట్లా దుతూ కోట్లమంది భక్తుల విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిర్వీర్యం చేసేలా టీటీడీ పాలక మండలి లో అన్యమతస్తులను నియమిస్తూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తుందని, ఇప్పటికే రామతీర్థం వంటి అనేక హిందూ దేవాలయాలలో అనేక దుశ్చర్యలకు పాల్పడిన దుండగులను పట్టుకొని శిక్షించడంలో అలసత్వం వహిస్తూ పాపం మూటగట్టుకున్న జగన్ రెడ్డి, ఇంకా హిందూ సమాజ నిర్వీర్యంనకు కుట్రకు పాల్పడడం సహించరానిదని, ఇదే కొనసాగితే హిందూ బంధువులందరం కలసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హిందూ దేవాలయ పరిరక్షణ కు ప్రతీ ఒక్కరూ ముందుకు రావలసిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

ఐసీడీఎస్ పీడీ గా శాంతిశ్రీ

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకురాలుగా బి.శాంతిశ్రీ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు పీడీగా పనిచేసిన జయదేవి దగ్గర నుండి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.. ఈ సందర్భంగా కలెక్టర్ కు రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ కట్టారు. గతంలో శాంతిశ్రీ డి.ఆర్.డి.ఏ. పీడీగా శ్రీకాకుళం జిల్లాలో విధులు నిర్వహించారు.

మైనర్ బాలికపై లైంగిక వేదంపులకు పాల్పడిన వ్యక్తికి 20 సంవత్సరాలు జైలు శిక్ష

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లాలోని నౌపాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 ఏళ్ళ మైనర్ బాలికపై తీవ్రమైన లైంగిక వేధింపులకు పాల్పడిన ముద్దాయి ఉప్పాడ సంతోష్ కుమార్ కు బుదవారం పోక్సో చట్టం క్రింద కేసుల విచారణకు నియమించబడిన ప్రత్యేక కోర్టు వారు 20 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.20 వేలు జరిమానా విధించారు. అలాగే బాధిత బాలికకు నష్ట పరిహారంగా ఒక లక్ష రూపాయలు చెల్లించాలని ఆదేశించారు. నౌపాడ మండలంలో బాధిత మైనర్ బాలిక పై ముద్దాయి ఉప్పాడ సంతోష్ కుమార్ జరిపిన లైంగిక దాడికి నౌపాడ పోలీసులు కేసు నమోదు చేయడమైనది. కేసు విచారణ సమయంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పైడి రమణ మూర్తి ద్వారా సాక్షులను కోర్టు నందు హాజరుపరిచి, జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక స్వీయ పర్యవేక్షణలో సమర్థవంతంగా ట్రయల్ నడిపి సరైన సాక్ష్యాధారాలతో రుజువు చేయడంతో నిందితుడుకు ఈ దినం పోక్సో చట్టం క్రింద కేసుల విచారణకు నియమించబడిన ప్రత్యేక కోర్టు వారు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 జరిమానా విధించారు. కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష పడటంలో ఖచ్చితమైన సాక్షాదారులతో దర్యాప్తు పూర్తి ఎం.శివా రామి రెడ్డి చేసిన దర్యాప్తు అధికారులను మరియు కేసుకి సహకరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

జీడి పరిశ్రమలు నిరవధిక బంద్‌కు పిలుపు

పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్ కుమార్

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ జీడి కార్మికుల తీరుపై పలాస జీడిపప్పు ఉత్పత్తి దారుల సంఘం నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పలాస పిసిఎంఏ కార్యాలయం భవనంలో బుధవారం వ్యాపార సంఘ నాయకులు సమావేశం ఏర్పాటు చేసారు. ఇటీవల జీడి వ్యాపారిపై జరిగిన దాడికి నిరసనగా మొత్తం పలాస-కాశీబుగ్గ జీడి పరిశ్రమలు గురువారం నుంచి బంద్ చేస్తున్నట్లు పిసిఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్ కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మల్లా సురేష్ కుమార్ మాట్లాడుతూ దొంగతనం చేసి తిరిగి తమ సభ్యుడిపై ఒక కార్మికుడు దాడి చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేసారు. ఇది మంచి సాంప్రదాయం కాదని, బాధిత వ్యాపారి పొట్నూరు బాలాజి ఫిర్యాదు మేరకు కార్మికులతో చర్చించామని, ఆయన ఆరోపణ చేసిన వెంటనే ఆ పరిశ్రమలో మొత్తం కార్మికులు పనులు నిలిపి వేసారని, దీనిపై సంఘ పరంగా చర్చించేందుకు మంగళవారం పీసీఏంఏ సమావేశ మందిరంలో కార్మికులతో చర్చించా మన్నారు. తాము చేసిన ఆరోపణలకు బదులు ఇవ్వకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్మికుడు వ్యాపారి బాలరాజుపై దాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేసారు. తాము కార్మికులకు దొంగతనంపై ప్రశ్నించడమే నేరమా అని ప్రశ్నించారు. నష్టపోయిన వ్యాపారికి సంఘీభావాన్ని చెబుతున్నామని, ఈ వ్యవహారం తేలే వరకూ నిరవధికంగా జీడి పరిశ్రమలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి చుట్టుప్రక్కల ఉన్న వ్యాపారులకు కూడా మద్దతు ఇవ్వాలని కోరుతున్నామని స్పష్టం చేసారు. బాధిత వ్యాపారి బాలరాజు మాట్లాడుతూ రూ.10 లక్షల విలువైన జీడి పప్పు రెండేళ్లలో మాయమైందని, దీనిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెళితే పనులు నిలుపుదలచేసి ఆర్థికంగా నష్టం చేకూర్చారని ఆరోపించారు. పిసిఎంఏ కార్యదర్శి పట్నాన రవికాంత్ మాట్లాడుతూ జీడి వ్యాపారుల చరిత్రలో చీకటి రోజని, వ్యాపారులకు భద్రత లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. కార్మికుల వైఖరి ఇదే విధంగా ఉంటే పలాస బ్రాండ్ జీడి పప్పు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. వ్యాపారులపై దాడులు గతంలో ఎన్నడూ జరగలేదని, ప్రస్తుతం కార్మికులు తమపై భౌతికంగా దాడులకు దిగడం పట్ల విచారం వ్యక్తం చేసారు. మాజీ కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ మాట్లాడుతూ దొంగతనం అభియోగాన్ని చర్చకు పెడితే దాడులు తగవని, జరిగిన జీడిపప్పు నష్టం, సభ్యునిపై దాడి అంశాలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. సమావేశంలో వ్యాపార సంఘ సభ్యులు మల్లా భాస్కరరావు, బెల్లాల నారాయణరావు, కొత్తకోట తిరుమలరావు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేసిన దాతలు

విశాలాంధ్ర - రణస్థలం : మండలం, జెఆర్ పురం గ్రామానికి చెందిన జొన్నాడ దుర్గా రావు ఇటీవలే మూడంతస్తుల మేడపైన నుంచి కాలుజారి కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న యువ టీం అంజిబాబు ఆధ్వర్యంలో సేకరించిన విరాళం మొత్తాన్ని దుర్గారావు తల్లికి బుధవారం అందజేశారు. దాతలు ద్వారా సేకరించిన విరాళం మొత్తం రూ.17వేలు దాతల సమక్షంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంజిబాబు మాట్లాడుతూ మేము చేసే సేవా కార్యక్రమానికి స్పందిస్తున్న దాతలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని తెలియజేశారు. అదేవిధంగా నేను చేసే సేవా కార్యక్రమానికి నాకు అండదండగా ఉన్న మేమున్న సేవా సంఘ సంస్థా పకులు సాయిరాం కి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి పచ్చి గుళ్ళ సాయిరాం, వడ్డి రమణ, అన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

విశాలాంధ్ర - కాశీబుగ్గ : మండలం బ్రాహ్మణ తర్లా గ్రామానికి చెందిన బడే శరణ్య పాలి టెక్నికల్‌కు ఎంపికైంది. ఇటీవల విద్యార్థి తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో విద్యార్థి చదువు నిమిత్తం తమవంతుగా బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్ బుధవారం 7వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సారాకుమార్, వూన హరికృష్ణ, లోకనాధం, వేణుగోపాల్, ఆర్.జె.మణి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు, రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపిన ఓంశాంతి సిస్టర్స్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : అన్నాచెల్లెళ్లు లేదా అక్కా తమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా రక్షా బంధన్ అని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఓం శాంతి సిస్టర్స్ కలెక్టర్ కు రక్షా బంధన్ సూచనగా రాఖీ కట్టారు. అందరూ ఆయురారోగ్యాలతో బాగుండాలని ఆయన కోరారు. రక్షా బంధన్ శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జగన్మోహనరావు, ఓం శాం సిస్టర్స్ పాల్గొన్నారు.

గోవుల సేవలో రోటరీక్లబ్

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం బారువ సమీపంలో గల గోశాలలో సోంపేట రోటరీక్లబ్ సభ్యులు బుధవారం సేవలందించారు. బారువ సమీపంలో గల బాలాజీ గోశాలకు వెళ్లి రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 300 ఆవులకు పది బస్తాల దాణాతో పాటు అటుకులు, బెల్లాన్ని అందించారు. దీంతో పాటు సోంపేటకు చెందిన కొల్ల తిరుపతి అనే వ్యక్తికి ప్లేట్‌లెట్‌లు అత్యవసరంగా పడిపోవడంతో సమస్యను తెలుసుకున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు హృదయం ఫౌండేషన్ అధినేత దుద్ది శ్రీనివాసరావు శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంక్ సహాయంతో 6యూనిట్ల ప్లేట్‌లెట్‌లను బాధితునికి అందించి ప్రాణాపాయ స్థితి నుంచి గట్టెక్కించారు. వెంటనే స్పందించిన దుద్ది శ్రీనివాస్‌కు వైద్యులు, బాధితుల బంధువులు అభినందించారు. కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ప్రతినిధులు వడ్డి శివశంకరరావు, టంకాల బాబు, పైడిశెట్టి మధు, మద్ది శ్రీనివాసరావు, బిఎస్ఆర్ చలపతి, వూనా తిరుపతిరావు, కొంచాడ తిరుమల, బెల్లాన లింగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పిటి 2: గోశాలకు దాణా అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : పాఠశాలపైన సిబ్బంది పైన నమ్మకంతో పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలకు పంపుతుంటారని, పాఠశాలకు వచ్చాక వారి మంచి చెడుల పట్ల తగిన శ్రద్ధ వహించాల్సిన బాధ్యత సిబ్బందికి ఉంటుందని ఎం.ఈ.ఓ కె. అప్పారావు అన్నారు. స్థానిక సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. మొదటిసారిగా నియోజకవర్గ స్థాయిలో వ్యాయామ విద్య పై స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. పిల్లల క్రమశిక్షణ, ఆరోగ్యం తదితరాల బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదే అని ఎం.ఈ.ఓ ఉద్బోధించారు.

వృద్ధాశ్రమంలో ఉపహార్ స్టూడెంట్ సేవలు

విశాలాంధ్ర - పొందూరు : మానవసేవయే మాధవ సేవగా భావించి లోలుగు ఉపహార్ స్టూడెంట్ కేర్ సెంటర్ విద్యార్థినీ విద్యార్థులు వృద్ధులకు చేయూతనిచ్చి మంచి మానవత్వాన్ని చాటుకున్నారు. శ్రీకాకుళంలో గల సీవీ నాగజ్యోతి ఆనంద నిలయ వృద్ధ ఆశ్రమంలో జీవనం సాగిస్తున్న 17 మంది వృద్ధులను లోలుగు ఉపహారు సంస్థ గుర్తించింది, ఎవరో వస్తారని, చేయూతనిస్తారని, ఎదురు చూసే పండుటాకులకు ఆ సంస్థ ఆదుకోవాలనే దృక్పథంతో వృద్ధాశ్రమానికి వెళ్లి సందర్శించారు. ఆ వృద్ధులను పిల్లలు మనసారా అవ్వ తాత అంటూ పిలుస్తూ ప్రేమతో పండ్లు రొట్టెలను పంచిపెట్టారు. పిన్న వయస్సు లోనే మానవత్వాన్ని చాటుకున్న తీరున చూసి వృద్ధుల ముఖాలలో ఆనందాన్ని ఉత్సాహాన్ని నింపగలిగారు. ఈ కార్యక్రమంలో లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటర్ లోపింటి అప్పారావు, స్వాతి, మాలతి పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - కవిటి : మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న జయకృష్ణ జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా క్రీడ దుస్తులను అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు పదివేల రూపాయలు విలువ చేసే 10 జతల క్రీడా దుస్తులను ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ సహాయకులు జయకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఆటల్లో రాణించి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. జయకృష్ణ క్రీడా దుస్తులు క్రీడాకారులకు అందజేయడంపై ప్రధానోపాధ్యాయ మల్లేశ్వర రావు, పిడి జి ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఎంపీ నిధుల వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రజా సంక్షేమం, వనరుల కల్పనలో భాగంగా చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డుతోందని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. తన కోటా నిధులను వెచ్చించే విషయంలో ఉద్దేశ పూర్వకంగానే ఆటంకాలు సృష్టిస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్రణాళికా అధికారి కార్యాలయంలో బుధవారం జరిగిన ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై సమీక్షలో ఆయన మాట్లాడారు. పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, ఐటీడీఏ, ఇతర శాఖల అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ ఆశించిన స్థాయిలో ఎంపీ నిధుల సద్వినియోగంలో డిజిటలైజేషన్ ప్రక్రియతో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని తరహాలో ప్రజలకు వనరులు సమకూర్చే విషయంలో వైసీపీ నాయకులు ఇబ్బందులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటి వరకు దాదాపు రూ.13 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నామని, వీటి అమలులో రాజకీయ దురుద్దేశాలను అంటగడుతున్నారని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం, అధికారుల, అధికార పార్టీ నాయకులు ఈ తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్

విశాలాంధ్ర - పలాస : కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో వద్ద నూతనంగా రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశ పెట్టబోతున్న కార్డు ప్రైమ్ 2.0 వలన నష్టం కలుగుతుందని బుధవారం దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేసి రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రారు ఎస్.తవిటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ దస్తావేజు లేఖర్లు సంఘం అధ్యక్షులు రవికుమార్ పట్నాయిక్ మాట్లాడుతూ రాష్ట్ర దస్తావేజు లేఖర్లు పిలుపు మేరకు రెండు రోజుల పాటు పెన్‌డౌన్ కార్యక్రమం చేట్టామన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ నూతనంగా రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశ పెట్టబోతున్న కార్డు ప్రైమ్ 2.0 వలన దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండురోజులు దస్తావేజులు రాయడం, ఈసిలు, నకళ్లు మొదలైన వాటిని ఎటువంటి కార్యకలాపాలు నిలిపి వేస్తామన్నారు. కార్యక్రమంలో నర్తు ధనుంజయరావు, జయరాం, ఎల్.గోవిందరావు, శిష్టు శ్రీనివాస్, శ్యామ్ పట్నాయిక్, వెంకటేష్, బి.వి.ఎన్.రావు, లండ సురేష్, దస్తావేజులేఖర్లు, స్టాంప్ వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రూ.55 లక్షల విలువైన నకిలీ నోట్లు స్వాధీనం : ముగ్గురు అరెస్ట్

విశాలాంధ్ర - ఎచ్చర్ల : వేర్వేరు చోట్ల పోలీసులు జరిపిన తనిఖీల్లో రూ.55 లక్షలు విలువైన రెండు వేల రూపాయల నకిలీ నోట్లు పట్టుబడ్డాయి. జి ఆర్ పురం సిఐఎం ఆదామ్ ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యనారాయణ బుధవారం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ లో తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు చిలకపాలెం జంక్షన్ వద్ద ఈనెల 24వ తేదీన నిర్వహించిన తనిఖీల్లో దుంగ వీరమనికంట (తుని) నుంచి 37 లక్షల విలువైన రెండు వేల నకిలీ నోట్లు స్వాధీనం చేసుకుని అదుపులోనికి తీసుకున్నామన్నారు. ఈనెల 29వ తేదీన సాయంత్రం పైడిభీమవరం వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో గనగల్ల విజయ్ కుమార్ (విజయనగరం) కంపన గారు వెంకటరెడ్డి (కర్ణాటక) లను పట్టుకొని 17.98 లక్షల విలువైన 2000 నకిలీ నోట్లు, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ రెండు కేసుల్లో 55 లక్షల విలువైన 2000 విలువైన నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

ఎస్పీ రాధిక దిశ పోలీసు స్టేషన్ వార్షిక తనిఖీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక దిశ పోలీసు స్టేషన్ ని తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఎస్పీదిశ పోలీసు స్టేషన్లోని సౌకర్యాలు, ముఖ్యమైన రికార్డుల నిర్వహణలపై లోతుగా పరిశీలించి సిబ్బంది పనితీరుపై సంతృప్తిని వ్యక్తపరిచారు. దిశ పోలీసు స్టేషన్లో ఉమెన్ రిసెప్షన్ సెంటర్ , కౌన్సెలింగ్ గది, వెయిటింగ్ షెల్టర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దిశ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయడం ముఖ్య ఉద్దేశం మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ, భద్రత కల్పించడమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నీతి, నిబద్ధతతో విధులు నిర్వర్తించి మహిళలకు భద్రత కల్పించాలని పేర్కొన్నారు. పోలీసు స్టేషన్ కువచ్చే పిర్యాదుదారులుతో ముఖ్యంగా మహిళలు పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలని అన్నారు. పాఠశాల,కళాశాల వద్ద దిశ బీట్ సిబ్బంది దిశ వాహనాలతో గస్తీ నిర్వహించి ర్యాగింగ్ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దిశ యాప్ గురించి మహిళలకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.స్పందన పిటీషన్స్, ముఖ్యమైన కేసులు దర్యాప్తు పై దృష్టి సారించాలని దిశ డిఎస్పినకు ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీ తనిఖీలో దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీ యస్.వాసు దేవ్,మహిళ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టిని సారించండి

డ్వామా పీడీ జీవి చిట్టి రాజు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లాలో ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల పరిరక్షణకు ప్రత్యేక దృష్టిని సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పిడి జీవీ చిట్టి రాజు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సెలకం సింగువలస గ్రామంలోని పండ్ల తోటల పెంపకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ లబ్ధిదారులు అంతర పంటలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందాలని సూచించారు. అదే విధంగా ప్రతి మొక్క బతికే విధంగా సంరక్షణ చర్యలను చేపట్టాలని ఉపాధి హామీ పథకం ద్వారా మూడు సంవత్సరాల పాటు మొక్కల సంరక్షణకు అవసరమైన నిధులను మరియు ఎరువులను అందజేయడం జరుగుతుందన్నారు. ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా చెరువులు పంట కాలువ గట్లపై మొక్కల పెంపకం పనులతో పాటు రోడ్లకు ఇరువైపులా రెవెన్యూ ప్లాంటేషన్ వ్యక్తిగత పండ్లతోటల పెంపకం వంటి పనులను చేపట్టడం జరుగుతుందని ఈ మొక్కల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు అయినప్పుడే పచ్చదనం పెంపొంది స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుందన్నారు. భూమిపై మొక్కల శాతం తగ్గడం వలన మాత్రమే ఉష్ణోగ్రతలో ఘననీయంగా మార్పులు వస్తున్నాయని ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సీతారాం, ఈసి బాలముకుంద బాబు సిబ్బంది పాల్గొన్నారు.

కిచెన్ గార్డెనింగ్‌పై గ్రామీణ మహిళలకు శిక్షణ

విశాలాంధ్ర - ఆమదాలవలస : గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్న మహిళలు చాలా మేరకు రక్తహీనతతో బాధపడు తున్నారు అనే కారణం చేత కిచెన్ గార్డెనింగ్ పై శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమంలో భాగంగా బుదవారం ఇసకల పాలెం గ్రామం సరుబుజ్జిలి మండలం లో రిలయన్స్ ఫౌండేషన్ మరియు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంయుక్తంగా మహిళా రైతుల కొరకు పెరటి తోటలు ఏవిధంగా ఏర్పాటు చేసుకోవాలి అనే విషయం పైన శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. ఈ కిచెన్ గార్డెనింగ్ శిక్షణలో భాగంగా ఐదు సెంట్లు పొలంలో ఒక పదకొండు రకాల కూర గాయలు పండించు కోవటం, మరియు దాని ఉపయోగాలు, ఆ కూర గాయలు ఏ విధంగా పండించాలి వాటికి యాజమాన్యం ఏవి ధంగా చేపట్టాలి అనే విషయాల తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో మహిళలకు వివిధ రకమైన కూరగాయల విత్తనాలు రిలయన్స్ ఫౌండేషన్ ఉచితంగా ఇవ్వడం జరిగింది. భవిష్యత్తులో తమకు తాము సొంతంగానూ కిచెన్ గార్డెన్ తయారు చేసు కుని సొంతంగా పౌష్టికాహారం తయారు చేసుకు న్నట్లయితే చాలా మేరకు రక్తహీనత ను అధిగమించవచ్చని తమకు తాము పౌష్టికాహారం తయారు చేసుకోవడం వలన చాలా మేరకు ఇంటి ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్, డా. సునీత, డా.శిల్పలు అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు జి. తిరుమలరావు, సీపాన రాజారావు, మహిళ రైతులు పాల్గొన్నారు.

మొదటి స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్

విశాలాంధ్ర - టెక్కలి : టెక్కలి నియోజకవర్గం వ్యాయామ ఉపాధ్యాయులందరికీ స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ మొదటిసారిగా టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓ-2 డి.చిన్నా రావు, స్కూల్ హెచ్ఎం డి.నాగభూషణ రావు, నియోజక వర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బి.నారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసెంబ్లీ, ఎయిమ్స్ అండ్ గోల్స్, పిఈటి జాబ్ చార్ట్, యస్ జిఎఫ్ఐ టోర్నమెంట్స్, కెలో ఇండియా రిజిస్ట్రేషన్ అండ్ ఫిట్నెస్, స్టూడెంట్ కెరియర్స్, స్పోర్ట్స్ పర్సనాలిటీ, యోగ మరియు ఇతర వ్యాయామ సంబంధించిన విషయాలు పై చర్చించారు.ఈ సమాచారాన్ని నియోజకవర్గంలో గల వ్యాయామ ఉపాధ్యాయులందరికీ అందించడం జరుగుతుందని, నియోజకవర్గంలో గల మండల ఎమ్మెస్ఓలు టెక్కలి కెకె.రామిరెడ్డి, నందిగాం జి.శ్రీనివాసరావు, సంతబొమ్మాళి పి. తిరుపతిరావు,కోటబొమ్మాళి సిహెచ్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు పరామర్శ

విశాలాంధ్ర - గార : ఏఐటీయుసీ అనుబంధ సంస్థ అయిన శ్రీకాకుళం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి అర్జి పోలవతి తండ్రి ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, ఆ కుటుంబాన్ని నగరంలోని మంగువారి తోటలో బుధవారం పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోలవతి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కొమర భాస్కరరావు, యూనియన్ అధ్యక్షులు మాడుగుల రాఘవ, ఏఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చిక్కాల గోవిందరావు, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు, సిపిఐ టౌన్ కార్యదర్శి డోల శంకరరావు, జగదీష్, యునియన్ సభ్యులు ఉన్నారు.

సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం యామాల పేట సర్పంచ్ అంగూరు మధుసూదనరావు మాతృమూర్తి సావిత్రమ్మ మృతి చెందడంతో, ఆ కుటుంబాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస రావు బుధవారం సాయంత్రం పరామర్శించారు. ఆమె మృతికి తన ప్రఘాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

వచ్చేనెల నాలుగున జిల్లా వ్యాప్త ధర్నాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 4న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాలు వద్ద ధర్నాలు జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం నగరంలోని పలు వార్డుల్లో కరపత్రాలు ప్రచారం, సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో, ధరలు అదుపు చేయడంలోనూ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాల వలన ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రజల ఆదాయాలు పెరగడం లేదని దీనివలన పేద మధ్యతరగతి ప్రజల జీవనం కష్టంగా మారిందని వారు అన్నారు. మోడీ ప్రభుత్వానికి అదాని, అంబానీ వంటి కార్పొరేట్లు ప్రయోజనాలు తప్ప దేశ ప్రజల కష్టాలు పట్టడం లేదని వారు విమర్శించారు. మోడి గద్దెనెక్కిన తర్వాత 450/- రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ రూ.,1200/-లకు పెరిగిందని, డీజిల్, పెట్రోల్ చార్జీలకు అంతు లేకుండా పెరుగుతున్నాయని, కూరగాయల ధరలు ఈ నెలలోనే 37 శాతం పెరిగాయని, పప్పు దినుసులు 45శాతం పెరిగాయని, ఉల్లిపాయలు గతంలో కేజీ రూ.100లు ఉండగా, నేడు టమాటా రూ.,200/- పలుకుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు పెరగడం అంటే ప్రజల నిజ ఆదాయము తగ్గడమే అన్నారు. లోటు పేరుతో ట్రూ అప్ చార్జీలు, ఫిక్స్ చార్జీలు, సర్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఎస్టాబ్లిష్మెంట్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో ఈ ఏడాది కాలంలో సుమారుగా నాలుగువేల కోట్ల రూపాయలు ప్రజల నుండి చార్జీల రూపంలో దండుకున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్బికేల ద్వారా కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కె.నాగమణి, పి తేజేశ్వర రావు,టి తిరుపతి రావు, సీహచ్ అమ్మ న్నాయుడు, ఎ.మహాలక్ష్మి, ఎ.నత్యం, యం.గోపి, కె.సూరయ్య, కె చంద్రశేఖర్, పాణి గ్రహణం, బి సింహచలం పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు లేకపోవడంతో నిలిచిపోయిన లారీలు

విశాలాంధ్ర - జలుమూరు : గత రెండు రోజులుగా జలుమూరు మండలంలో అక్రమంగా రవాణా చేస్తున్న పర్లాం ఇసుక ర్యాంపును నిలుపుదల చేయాలని మాజీ శాసనసభ్యులు బగ్గ రమణమూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలు, ధర్నాల్లో భాగంగా సోమవారం నుంచి ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ మేరకు వచ్చే వందలాది లారీలు నిలిచిపోయాయి.

నేత్రదానం.. రెండు ప్రాణాలకు చూపు

విశాలాంధ్ర - పలాస : నేత్ర దానం చేయడం ద్వారా రెండు ప్రాణాలకు చూపు నిస్తుందని పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ అన్నారు. బుధవారం పలాస ప్రభుత్వాసుపత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది కార్నియా అంధత్వంతో బాధ పడుతున్నారని, అందులో ఎక్కువ శాతం చిన్నారులు, యువకులు ఉన్నారని అన్నారు. నేత్రాలు దానం చేసేందుకు వయస్సుతో సంబంధం లేదని, ప్రతి ఒక్కరు నేత్రాలు దానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన, డాక్టర్ కూర్మా రావు, ఆప్తమిక్ అసిస్టెంట్ తారకేశ్వరరావు, గౌరీ, హెడ్‌నర్సు ఉమాదేవి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైనాట్ ఓ.పి.ఎస్ విజయవంతమే లక్ష్యం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : సి.పి.ఎస్ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి పోరాటం తథ్యమని ఏ.పి.సి.పి.ఎస్.ఈ.ఏ రాష్ట్ర కౌన్సిలర్ బి. శంకరం అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఏ.పి.సి.పి.ఎస్.ఈ.ఏ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు, యు.టి.ఎఫ్, యూ.పి.ఎఫ్, ఏ.పి.టి.ఎఫ్, రెవిన్యూ సి.పి.ఎస్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరం మాట్లాడుతు సమస్యల పరిష్కారం కోరుతు సెప్టెంబర్ 1న విజయ వాడలో తలపెట్టనున్న వైనాట్ ఓ.పి.ఎస్‌ను విజయవంతం చేసే లక్ష్యంతో ప్రతీ ఒక్కరు వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండగ

విశాలాంధ్ర - ఎచ్చర్ల : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో విసి ప్రొఫెసర్ వెంకటరావుకు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరి విద్యాలయం కు చెందిన ముఖ్య ప్రతినిధి వీకే సంధ్య రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి, ప్రశాంత జీవనానికి బ్రహ్మకుమారి సంస్థ చేస్తున్న కృషిని సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా వి సి కొనియాడారు.

జిల్లా కలెక్టర్‌ను కలసిన సుడా కార్యదర్శి ఎంవి.లక్ష్మి

విశాలాంధ్ర - శ్రీకాకుళం : సుడా కార్యదర్శి ఎంవి లక్ష్మి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ ను కలెక్టర్ కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె శుక్రవారం సుడా కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

వంతెనను అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర - జలుమూరు : హిరమండలం నుండి కరకవలసకు వెళ్ళే దారిలో వంశధార ఎడుమ కాలువపై శిధిలావస్థకు చేరుకున్న వంతెనను అభివృద్ధి చేయాలని స్థానికులు, వాహన దారులు వంశధార అధికారులును కోరుతున్నారు. దశాబ్దాల క్రితం కాలువ నిర్మాణం చెప్పినప్పుడు ఇక్కడ వంతెన నిర్మాణం చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం వంతెనపై రక్షణ గోడ లేకపోవడం వలన వాహనదారులు పాదచారులు ఇబ్బందులుకు గురవుతున్నట్లు తెలిపారు.

శివారు భూములకు సాగునీరు అందించాలి

విశాలాంధ్ర - ఎచ్చర్ల : సంతకవిటి మండలం నారాయణపురం ఆనకట్ట వద్ద షట్టర్స్ ను బిగించి ఎచ్చెర్ల మండలంలోని శివారు గ్రామాలకు సాగునీరును సక్రమంగా అందించాలని ఏయంసి మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. నారాయణపురం ఆనకట్టను రైతులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదిలో నీరు లేదని శివారు గ్రామాలకు సాగునీరు అందించలేకపోతున్నామని జలవనురుల శాఖ అధికారులు చెబుతున్న మాటలు సరికాదన్నారు. వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే షట్టర్లు లేకపోవడం వలన ఆనకట్ట నుంచి నీరు నదిలో వృధాగా కలిసిపోతున్నదన్నారు. ఆనకట్ట వద్ద సుమారు 9 షట్టర్లు పూర్తిగా పాడయ్యాయని చెప్పారు. షట్టర్లను పునరుద్ధరిస్తే శివారు గ్రామాలకు సాగునీరున సక్రమంగా అందించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మాజీ సర్పంచ్ బాన్న రాంబాబు పాల్గొన్నారు.

పోర్టు బాధితులకు జీడి చెట్ల పరిహారం అందజేసిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్వాసితులకు జీడి చెట్లకు సంబంధించిన నష్ట పరిహారం చెక్కులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోర్టు ప్రారంభించక ముందు ప్రభుత్వపరంగా ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించే పోర్టు పనులు పూర్తి చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం గా ఇప్పుడు ప్రతి నష్టపోయిన జీడి రైతుకు ఒక్కో మొక్కకు 2500 రూపాయలు చొప్పున పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అలాగే పోర్టు నిర్మాణం తర్వాత ఈ ప్రాంతం తో పాటు శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి బాటలో పయనిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వసముద్ర సంస్థ జీఎం శంకర్, నౌపడ సర్పంచ్ పిలక బృంద రవికుమార్, స్థానిక రైతులు జీరు రాంబాబు, వైకాపా నాయకులు జీరు అప్పల రెడ్డి తో పాటు మూలపేట లింగుడు విష్ణు చక్రం గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు.

ప్రైమ్ 2 ఓ విధానానికి వ్యతిరేకంగా నిరసన

విశాలాంధ్ర - ఆమదాలవలస : స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రిజిస్ట్రేషన్ నిమిత్తం తీసు కొచ్చిన ప్రైమ్ 2 ఓ విధానానికి వ్యతిరేకంగా ఆమదాలవలస రైటర్ సంఘం స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ ఇటు వంటి ఆన్లైన్ ప్రక్రియ తీసుకోవడం వలన న్యాయపరమైన చిక్కులు అమ్మకము, కొనుగోలుదారులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇన్నేళ్లుగా ఈ వృత్తిలో కొనసాగిన తమ పొట్టలు కొట్టే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇటువంటి లోపభూ యిష్టమైన ప్రైమ్ 2 ఓ విధానాన్ని అద్దు కోవాలని తెలిపారు. అనంతరం సబ్ రిజిస్టర్ బి అరుణకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ కే పెద్దిరాజు ఆర్ నాగరాజు, బి శ్రీనివాసరావు, పి నాగరాజు, ఎం.సురేష్, చింతల లక్ష్మణరావు, సువ్వారి రాజు,పి ప్రభాకర్ రావు, ఎం వేణు, పి.రవి, జిడిల్లేశ్వరరావు, బి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలో జిల్లా ఎస్పీ బాధ్యత అభినందనీయం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : పాఠశాలల స్థాయిలో విద్యార్థినీలు భద్రత కార్యక్రమంలో భాగంగా, జిల్ ఎస్పీ భాధ్యత ఎంతో అభినందనీయమని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాటశాల ప్రధానో పాధ్యాయులు కోత చైతన్య అన్నారు. బుధవారం జిల్లా ఎంపీ ఆదేశాలు మేరకు పోలీసు స్ఫూర్తి బృందం దాలినాయుడు, ప్రసాద్, ప్రభావతి, ధనలక్ష్మి, ద్రాక్షాయిణి లతో 9,10 తరగతులు కు చెందిన 117 మంది విద్యార్థులుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల దండుగోపాలపురం నందు శ్రీకాకుళం పోలీసుశాఖ వారి దాలినాయుడు, ప్రసాదు, ప్రభావతి, ధనలక్ష్మి,బాలికల పట్ల జరుగుతున్న నేరాలు, అకృత్యాలు, దిశ చట్టం, ఆన్లైన్ లో మోసాలు, బాల్య వివాహాలు వాటి ప్రభావం, ప్రేమ పేరుతో యువత ఏవిధంగా జీవితం నాశనం చేసుకుంటుంది, సాంఘిక మాధ్యమాలు ,టోల్ ఫ్రీ నెంబర్ 1098 ఉపయోగించే విధానాలు గురించి పోలీసు స్ఫూర్తి బృందం వివరించటం ఎంతో ప్రయోజనం అని అన్నారు. ఈ విషయాలను తెలిపే ఒక లఘునాటికను ప్రదర్శించారు. విద్యార్థినిలతో వారు తెలుసుకున్న విషయాలను చెప్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తూట భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు ఆదికేశవరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, చిన్నారావు,రాము, విజయలక్ష్మి, రవికుమార్, మురళీధరరాజు, మార్కండేయులు, క్రిష్ణవేణి, సీఆర్పీ గిరి, రోజా, దయాసాగర్ పాల్గొన్నారు.

ధరలను అదుపు చేయాలి

విశాలాంధ్ర - పలాస : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టానుసారంగా ధరలను పెంచుకుపోతున్నారని, సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని సిపిఎం నాయకుల ఎన్.గణపతి డిమాండ్ చేశారు. బుధవారం పెరుగుతున్న ధరలు అదుపు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీల తగ్గించాలని, ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ పలాసలో సిపిఎం ఆధ్వర్యంలో సంతకాలు చేపట్టారు.

పోలీసు కార్యాలయంలో ఘనంగ్గా రాఖీ పండగ వేడుకలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లా ఎస్పీ జిఆర్ రాధిక సూచనలు మేరకు బుధవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాల యంలో ప్రజాపిత బ్రహ్మా కుమారీ సమాజం సోదరీమణులు రక్షా బంధన్ సందర్భంగా ఆదనపు ఎస్పీలు టిపి విఠలేశ్వర్, జె,తిప్పే స్వామీ తోపాటు ఇతర పోలీసు సిబ్బందికి రాఖీ కట్టి, రక్షా బంధన్ శు భాకాంక్షలు తెలియజేశారు. రాఖీ పండుగ సోదరి సోదరమణిల మధ్య అవ్యాజమైన ప్రేమకు ప్రతిరూపమైన రాఖీ పండుగ అని, రాఖీ కట్టి సోదర భావాన్ని తెలిపారని ఇరువురు ఆదనపు ఎస్పీలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరులకు అన్యాయం చేయవద్దు



విశాలాంధ్ర - సోంపేట : ఎన్నో దశాబ్దాలుగా దస్తావేజు లేఖ రులుగా బతుకులు సాగి స్తున్న తమకు ప్రభుత్వం సచివాలయాల్లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టి అన్యాయానికి గురి చేయడం తగదని సోంపేటకు చెందిన దస్తావేజు లేఖరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా బుధవారం పెన్‌డౌన్ నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే విధమైన నిర్ణయాన్ని దస్తావేజు లేఖరులు వ్యతిరేకించిన వెంటనే అప్పటి ప్రభుత్వం జీఓను ఉపసంహరించుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఇదే వృత్తిపై కొనసాగుతున్న దస్తావేజు లేఖరులకు ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా కొనసాగేలా కృషి చేయాలని కోరారు. ఈ మేరకు సోంపేట తహశీల్దార్ సత్యన్నారాయణకు, సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉద్యోగులు, అధ్యాపకులకు సన్మానం

విశాలాంధ్ర - హిరమండలం : ప్రభుత్వ జూనియర్ కళాశాల హిరమండలం లో ల్యాబ్ అసిస్టెంట్ గా పని చేసిన పిటివిఎస్ఎస్ ప్రసాద రావు, పదవి విరమణ సందర్భంగా బుధవారం ఉదయం కళాశాల ప్రాంగణంలో విరమణ సన్మాన సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పివిఎస్ పట్నాయక్ అధ్యాపకులతో కలిసి ప్రసాద్ దంప తులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. మెమెంటో అందించారు. అలాగే కళాశాల నుంచి బదిలీపై వెళ్తున్న లైబ్రేరియన్ జె.వి.గిరిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. నూతనంగా బదిలీపై వచ్చిన గణిత అధ్యాపకులు ఎఎస్ఈఎస్ఎన్ సుధాకర్, లైబ్రేరియన్ ఎస్ సూర్య కుమారిలకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పిఎస్ఎన్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి కి పదవి విరమణ తప్పదని పని చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేపేనపేటలో జీవామృతం కుండీలు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆమదాలవలస : మండలం ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా వరి సాగు చేసే రైతులు పొలాల వద్ద రైతుల చేత ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శాశ్వతంగా ఉండేలా జీవా మృతం కుండీలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జ్ నక్క చిరంజీవి మాట్లాడుతూ బుధవారం చేపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గా పనిచేస్తున్న సురేష్ కాంపాక్ట్ బ్లాక్ పరిధిలో శాశ్వత జీవామృతం కుండీలను ఏర్పాటు చేయించామని అన్నారు. రైతులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని వీటిలో జీవామృతాన్ని కలువు కోవడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఈ విధమైనటు వంటి శాశ్వత జీవామృతం ఫిట్స్‌ను రైతుల చేత పెట్టించడానికి మా సిబ్బంది ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు కోటేశ్వరరావు, సూర్యారావు, రామకృష్ణ, వెంకటరావు పాల్గొన్నారు.

అన్నాక్యాంటీన్‌కు రూ. 10 వేలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : స్థానిక మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీనుకు మండలం తిలాగు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ బుధవారం తన జన్మదినం సందర్భంగా రూ. 10వేలును అన్న క్యాంటీన్ నిర్వాహకులను అందజేశారు. అన్న క్యాంటీను ద్వారా వందలమంది పేదలకు రూ.5లకే రుచికరమైన భోజనం అందించటం జరుగుతుందని, అలాంటి అన్న క్యాంటీనుకు తన వంతు సహాయసహకారం అందించటం సంతోషకరంగా ఉందని రామక్రిష్ణ తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రామక్రిష్ణ జన్మదిన వేడుకలు కార్యకర్తలు, నాయకులు మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరాడ పెద్ద గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర - పాతపట్నం : మండల కేంద్రంలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏపీ సాక్స్ ఉద్యోగులు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిసి కోరారు. ఈ సందర్భంగా పాతపట్నం క్యాంపు కార్యాల యంలో బుధవారం ఆమెకు వినతి పత్రాన్ని అందజేసి, తమ సమస్యలను విన్న వించుకున్నారు. సుమారు 25 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చాలీచాలని జీతాలతో నెట్టుకొసు న్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1200 మంది ఉద్యోగులు వివిధ హోదాల్లో అనగా డాక్టర్లు, కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, సూపర్వైజర్లు, ఫార్మసిస్టు, అకౌంటెంట్లు, డేటా మేనేజర్లుగా పని చేస్తున్నామని అన్నారు. నిత్యం ప్రజాసేవలో భాగస్వామ్యంగా ఉన్న తమను తక్షణమే క్రమ బద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ద్వారా కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులకు కౌన్సిలింగ్ ఇస్తూ,హెచ్ఐవి పరీక్షలు నిర్వహిస్తూ, నిత్యం మందులు సరఫరా చేస్తున్నామని తెలిపారు. హెచ్ఐవి సోకిన వారి ఆత్మహత్యలను తగ్గిస్తూ, వారి జీవితకాలం పెరిగేలా తగు సూచనలు, సలహాలు అందిస్తున్నామని చెప్పారు. ఇందులో పని చేసే వారిలో ఎక్కువ మంది ఉద్యోగులకు ఇప్పటికే వయస్సు దాటిపోవడం వలన ఎక్కడికి వెళ్ళలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఇటీవల ఒరిస్సా, మణిపూర్ రాష్ట్రాల్లో హెచ్ఐవి అండ్ ఎయిడ్స్ కంట్రోల్ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసినట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే వినతిపత్రంపై స్పందిస్తూ తప్పనిసరిగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఏపీ ఎయిడ్స్ నియంత్రణ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీకాకుళం జిల్లా కమిటీ జనరల్ సెక్రెటరీ ఆర్ భూపతిరావు, పాతపట్నం ఐసిటిసి కౌన్సిలర్ జి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే తెలియజేయాలి : జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : బ్లూత్ స్థాయిలో సమస్యలుంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రాజకీయ పార్టీలను కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన సభ నియోజక వర్గాల వారీగ ఈ నెల 28వ తేదీ నాటికి జిల్లాల్లో 18,07,713 ఎలక్టోర్స్ ఉన్నాయన్నారు. ఈ నెల 23 నుండి 28వ తేదీ వరకు చేర్పులు, తొలగింపులు, చేర్పులు ఫారం-6) 5152, తొలగింపులకు (ఫారం-7) 2644, దిద్దుబాలకు ఫారం-8) 3324 ఫారమ్స్ స్వీకరించి నట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్లు దూరంగా ఉన్న పాడైనా, అలాంటి వాటికి మార్పులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలగింపుల ప్రక్రియకు సంబంధించి బియల్ ఏలకు తమవంతు సహాయం అందించాలని కోరారు. ఓట్ల తొలగింపులు, చేర్పులలో ఎలాంటి అపోహాలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడైనా ఓట్లు తొలగింపులు, చేర్పులలో, అవకతవకలు జరిగిన ట్లయితే ఫిర్యాదు చేస్తే సంబంధిత వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఓట్ల తొలగింపులు, చేర్పుల్లో అన్ని రాజకీయ పార్టీల వారు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి, మురళి కృష్ణ, వైయస్ఆర్ పార్టీ నుండి రౌతు శంకరరావు, టిడిపి సి.యం.జె. బాబు, సిపిఐ నుండి డి. గోవిందరావు, బియస్పీ నుండి ఎల్. సోమేశ్వరరావు, బిజెపి నుండి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం : ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్య సాయి సేవా సంస్థల అధ్యక్షులు లక్ష్మణరావు

విశాలాంధ్ర - హిరమండలం : మండలకేంద్రం హిర మండలం 2 సచివాలయం నకు సమీపంలోని ప్రేమ సాయి వృద్ధాశ్రమాన్ని ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్య సాయి సేవా సంస్థల అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు బుధవారం సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ వృద్ధాప్యము లో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన తోనే ఉండాలని తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆశ్రమం వాసులు నిరంతరము భగవాన్ నామ స్మరణ, తండులార్చన, లిఖిత నామ జపం, చేస్తూ జీవనాన్ని సాగించాలని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబరు 14, 15 తేదీల్లో రాష్ట్రస్థాయి యువజన సమ్మేళనము విశాఖపట్నంలో నిర్వహించనున్నామని, 26 జిల్లాల నుండి యువత హాజరుకానున్నారని, ఆశ్రమంలో వృద్ధులకు సేవ చేయడం గాను మూడు జిల్లాల నుండి సేవాదళ్ సభ్యులను ఏర్పాటు చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ఆశ్రమం రాష్ట్రంలోనే చాలా ఆదర్శంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆశ్రమం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రతి ఒక్కరూ ప్రేమతోనే మెలగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షులు అందవరపు అబ్బాయి, సమన్వయకర్త ఎస్ సాయిబాబా, సభ్యులు చంటి మాస్టారు, జోషుల గోవింద శర్మ, ఆశ్రమ మేనేజర్ కే జయరామ్, కే నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : కోటబొమ్మాళి పంచాయతీ ప్రకాశనగర్ కాలనీకు చెందిన డబ్బీరు సాయికుమార్ (28) బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే మృతుడు డబ్బీరు సాయికుమార్ తండ్రి నాగేశ్వరరావు సుమారు 20 ఏళ్ళ క్రితం మృతి చెందడంతో తన మేనమామ క్రిష్ణాపాత్రుని వెంకటరావు వద్ద సాయికుమార్ తల్లి లక్ష్మితో పాటు నివాసముంటున్నాడు. అయితే సాయికుమార్ ఐటీఐ వరకు చదువుకొని ఆపై చదువులు ఇష్టం లేక చదువును ఆపేసి వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అయితే ఈ కారణంగా వ్యాన్ యజమాని కొద్దిరోజులు క్రితం పనిలోంచి తొలగించారు. అప్పటి నుంచి జులాయిగా తిరుగుతూ మద్యం సేవిస్తూ ఉండేవాడని, కుటుంబ సభ్యులు ఎన్ని సార్లు మందలించిన సాయికుమార్‌లో మార్పు రాలేదు. అయితే యదావిధిగా మంగళవారం రాత్రి కూడా ఇంటికి చేరి పక్కన్న ఉన్న పెంకుటింటిల్లో పడుకున్నాడు. బుధవారం ఉదయం ఎప్పటికీ బయటకు రాక పోవడంతో కుటుంబ సభ్యులు లేపేందుకు వెళ్ళే సరికి సాయికుమార్ చీరతో ఉరివేసుకొని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్‌అలీ కేసు నమోదు చేశారు. కాగా తాను ఎటువంటి సంపాదన లేక వయసు వచ్చికూడా కుటుంబానికి బారం కాకుడదనే ఉద్దేశ్యంతోనే మనస్థాపంలో ఈ చర్యలకు పాల్పడి ఉంటాడని తన మేనమామ వెంకటరావు పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన స్నేహ షాపింగ్ మాల్

విశాలాంధ్ర - పాతపట్నం : మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఉన్న స్నేహ షాపింగ్ మాల్ లో అగ్నిప్రమాదం సంభవించింది. రాత్రి మూడు గంటల నుంచి దట్టమైన పొగ ఆలుముకొని ఈ ప్రాంత మంతా పొగ కమ్మేసింది. పాతపట్నం ఎస్ఐ యాసిన్ మహమ్మద్ తన పోలీస్ సిబ్బంది తో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఒరిస్సా సరిహద్దు ప్రాంతం పర్లాకిమిడి నుండి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు ఇంత లోగా టెక్కలి కేంద్రం నుండి కుడా అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది చేరుకొని పరిస్థితిని చక్కబెడుతున్నారు. షాప్‌లో ఉన్న రెండంతస్తులకు పూర్తిగా మంటలు వ్యాపించాయి. ఎవరికి ప్రాణ నష్టం లేదు. షాప్ యజమాని మాత్రం భయభ్రాంతులకు లోనయ్యారు ఏం జరుగుతుందో తెలియక అయోమయ పరిస్థితిలో ఉండిపోయారు. షాపులో ఉన్న బట్టలన్నీ పూర్తిగా కాలి బుడిదై పోయాయి. సుమారు కోటి రూపాయల వరకు నష్టం వాటిల్లవచ్చని స్థానికులు అనుకుంటున్నారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియడం లేదు. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ అయి ఉండ వచ్చని బావిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపడతామని పాతపట్నం ఎస్ఐ మహమ్మద్ యాసీన్ తెలియజేశారు.

వివేకానంద విగ్రహ ధ్వంశంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పొందూరు : మద్యం మత్తులో స్వామి వివేకానంద విగ్రహం పట్ల అవ మాన వీయంగా ప్రవర్తించిన ఘటనపై చర్యలు తీసు కోవాలని జనసేన పార్టీ డిమాండ్ చేసిం ది.మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నతపాఠశాలను జనసేన ఆముదాలవలస నియోజక వర్గం ఇన్చార్జి పేడాడ రామ్మోహన్, మండల అధ్యక్షులు వై. రమణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ బృందం సందర్శించి విగ్రహాన్ని పరిశీలించారు. విగ్రహం ధ్వంశంపై వైరల్ అయిన వీడియో ఆధారంగా ఘటనకు బాధ్యులైనవారిపై పోలీసులు సుమోటాగా కేసులు నమోదు చేయాలన్నారు. ఈ ఘటనను జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళతామన్నారు. ఘటనపై పాఠశాల సిబ్బంది ఎందుకు ఫిర్యాదుచేయలేదని ప్రశ్నించారు. పాఠశాలలో నైట్వాచ్మెన్ ఏమి చేస్తున్నట్లని ప్రశ్నించారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిడిమేరకే పాఠశాల సిబ్బంది ఘటనపై ఫిర్యాదు చేయలేదని విమర్శించారు. విగ్రహంతో పాఠశాలలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడి మురళి, మోహన్, కోరాడ రాజు, రామ్లక్ష్మణ్, గణేష్ పాల్గొన్నారు.

కుడి కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి

విశాలాంధ్ర - హిరమండలం : స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వంశధార కుడి కాలువలో గల్లంతైన వ్యక్తి మృత దేహం బుధవారం లభ్యమైంది. పాతపట్నం మండలం, సీది గ్రామానికి చెందిన మద్దిన బాలకృష్ణ (36) హైదరాబాద్ లో తాపీ పని చేస్తుంటారు హిరమండలం మేజర్ పంచాయతీ లొట్టివీధిలోని బంధువుల ఇంట్లో వివాహానికి సోమవారం వచ్చాడు. సాయంత్రం చిన్న కోరాడ వీధి వద్ద వంశధార కుడి కాలువలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో గల్లంతవ్వగా బుధవారం ఉదయం చిన్న కోరాడ వద్ద వంశధార కుడికాలువ వంతెనకు కొద్ది దూరంలో మృత దేహం లభ్యమైనది స్థానిక .ఎస్సై జి నారాయణ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని అన్నారు.

కొత్త పింఛన్లు ఎండమావేనా..

- జులై నుంచి రావాల్సిన కొత్త పింఛన్లు సెప్టెంబరు వస్తున్నా అమోదం దక్కని వైనం
- ఎనిమిది నెలలుగా లబ్దిదారుల నిరీక్షణ
- భారం తగ్గించుకునేందుకు ప్రభుత్వం ఎత్తులు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్తగా సామాజిక భద్రత పింఛన్లకు దరఖాస్తు చేసుకునే లబ్దిదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. గత ప్రభుత్వ హయాంలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోపు పింఛను మంజూరయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక పింఛను మంజూరు కావడానికి ఏడు ఎనిమిది నెలల నిరీక్షిం చాల్సి వస్తోంది. ఏటా జూన్, డిసెంబర్లలో మాత్రమే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం, ఆచరణలో మాత్రం పిల్లి మొగ్గలు వేస్తోంది. కిందటెడాది రెండు నెలలు ఆలస్యంగా జులై నెలాఖరుకు ఆమోదముద్ర వేసిన ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు ముగుస్తున్నా ఆమోద ముద్ర వేయలేదు. దీంతో ఎంతో మంది లబ్దిదారులు తమకు పింఛను వస్తుందో రాదో తెలియక ఆందోళన చెందుతున్నారు. వయోవృద్ధులు, వితంతువులు, దివ్యంగులు, పింఛను రాక పడరాని పాట్లు పడుతున్నారు.

దసరా వరకూ ఆగాల్సిందేనా? : కోటబొమ్మాళి మండలంలో గడిచిన ఏడు నెలల్లో సుమారు 433 మంది లబ్దిదారులు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వీరి దరఖాస్తులకు ఈ జూన్‌లో ఆమోదం లభించాలి. జులై నుంచి పింఛను మంజూరు చేయాలి. కానీ సెప్టెంబరు వస్తున్నా వీరి పింఛనుకు ఆమోదముద్ర పడలేదు. ఆమోదముద్ర సంగతి అలా వుంచితే ఇప్పటి వరకు వారి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తి కాలేదని తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం లబ్దిదారులు దరఖాస్తులు ఎంపీడీఓల లాగిన్‌కు చేరాయి. వాటిని పరిశీలించి అధికారులు ఒకే చేయడానికి, ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడానికి కనీసం ఇంకో నెల పైనే పడుతుంది. ఈ లెక్కన కొత్త పింఛన్లు దసరా వరకు వచ్చే అవకాశమే లేనట్లు తెలుస్తోంది.

భారం తగ్గించుకోవడానికి కుప్పిగంతులు: సంక్షేమ పథకాల భారాన్ని తగ్గించుకోవాలని ప్రయత్నిస్తున్న ప్రభుత్వం ఏదో ఒక రూపంలో లబ్దిదారులకు టోకరా ఇస్తోంది. ఉన్నపలాన పింఛన్లు తొలగించడం, తిరిగి పునరుద్ధరించడానికి ఆరు నుంచి తొమ్మిది నెలలు పాటు సమయం తీసుకోవడం అనే ఎత్తుగడలను ఎంచుకుంది. ఫలితంగా తక్కువలో తక్కువ ఆరేడు నెలల పింఛను ఇవ్వకుండా తప్పించుకోవచ్చని ప్రభుత్వ యోచనగా ఉంది. కానీ ప్రభుత్వం వేస్తున్న ఈ కుప్పిగంతులు ఏ ఆధారం లేని పండుటాకులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యంగులకు శాపాలుగా మారుతున్నాయి. అనేక మందికి పింఛను ఆమోదం పొందక ముందే తినడానికి తిండిలేక, మందులు లేక, ఆయువు తీరిపోతోంది. ప్రభుత్వం తక్షణ ప్రాతిపదికన పింఛన్లకు ఆమోద ముద్ర వేస్తే బాగుంటుందని లబ్దిదారులు కోరుకుంటున్నారు.

ఆదేశాలు రాలేదు...: కొత్త పింఛన్లకు సంబంధించి గతేడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మే వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సచివాలయ వెల్ఫేర్ లాగిన్ ద్వారా పంపించాం. పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు.

- కె. ఫణీంద్రకుమార్,ఎంపీడీవో, కోటబొమ్మాళి.